క్లుప్తంగా

3న గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు

వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడులో కొలువైన షిరిడీ సాయిబాబా మందిరంలో 3న గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు జరుగుతాయని ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం నుంచి కాకడ హారతి, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం, పల్లకి సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

డాక్టర్ కుటుంబానికి మంత్రి కారుమూరి పరామర్శ



డాక్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ ప్రణీత్ అత్త ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వింజం దొరసానమ్మ గత నెలలో అనారోగ్య కారణాలతో మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించారు. మంత్రి కారుమూరు శుక్రవారం తిరుపతికి వెళ్తూ మార్గమధ్యంలో ఆత్మకూరులోని డాక్టర్ ప్రణీత్ ఇంటికి చేరుకున్నారు. డాక్టర్ ప్రణీత్‌ను ఎస్వీ ప్రజా వైద్యశాల నిర్వాహకులు డాక్టర్ వెంకటేశ్వర్లు (దొరసానమ్మ భర్త) కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో పరిమితులు పాటించండి



మాట్లాడుతున్న రాజశేఖర్

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): పొగాకు పంట సాగులో గత వేలం సీజన్‌లో వచ్చిన ధరలను చూసి అత్యుత్సాహంతో రానున్న సీజన్‌లో అధిక ధరలకు ఫీజులు చెల్లించి భూములు, బ్యారన్లు రైతుల వద్ద తీసుకునేందుకు ఎగబడడం సరికాదని పొగాకు సాగులో ఉన్న పొగాకు బోర్డు సూచనలకు అనుగుణంగా స్వీయ నియంత్రణ పాటించాలని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో రాజశేఖర్ తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2022–23 పంట కాలంలో దిగుబడులు తగ్గడంతో పాటు ప్రపంచ మార్కెట్‌లో భారత పొగాకుకు అధికంగా డిమాండ్ వచ్చిందన్నారు. వచ్చే 2023–24 పంట కాలంలోనూ ఇదే పరిస్థితి ఉంటాయని రైతులు భావించవద్దన్నారు. డిమాండ్ ఉందని విచ్చలవిడిగా పొగాకు సాగు చేపట్టడంతో పాటు అధిక ధరలకు భూములు, బ్యారన్లు లీజుకు తీసుకోవడం, అధిక విస్తీర్ణంలో పొగాకు పండించడం వల్ల డిమాండ్ తగ్గి సాగుదారులకు నష్టాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారుల సూచనలు పాటించి లాభసాటి వ్యవసాయం చేసి నాణ్యతమైన పొగాకును పండించాలని తద్వారా రైతుల ఆదాయం నిలకడగా ఉంటుందన్నారు. పొగాకు బోర్డు అనుమతి లేకుండా కొత్త పొగాకు బ్యారన్లు నిర్మిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విచక్షణతో ఆలోచించి పొగాకు సాగు చేయాలని ఆయన కోరారు.


వీఏఏ మృతికి సంతాపం



వీఏఏ మృతికి సంతాపం తెలియజేస్తున్న నాయకులు, అధికారులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం చిన్నమాచనూరు సచివాలయం పరిధిలో వ్యవసాయ సహాయకురాలుగా పని చేస్తున్న షేక్ దొరసానమ్మ (24) ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన నేపథ్యంలో పోలిరెడ్డిపల్లిలోని సచివాలయంలో శుక్రవారం సంతాపం సభ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గటకం నరసింహారావు, నాయకులు గుంటుపల్లి రమేష్, ఒంగోలు శ్రీనివాసులురెడ్డి, ఉండేలు శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అంకిత భావంతో సేవలు అందిస్తూ అందరి ప్రశంసలు అందుకున్న దొరసానమ్మ మరణం విచారణమన్నారు. పంచాయతీ కార్యదర్శి కేశవకుమారి మాట్లాడుతూ తమలో ఒకరిలా విధి నిర్వహణలో నిత్యం పాల్గొంటున్న దొరసానమ్మ అకాల మరణం తామందరిని కలిచి వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వీహెచ్‌ఏకు తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన రమేష్

కలిగిరి: మండలంలోని తెల్లపాడు రైతుభరోసా కేంద్రంలో విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ) రమేష్ బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి పడి తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం విధులకు హాజరవడానికి వస్తుండగా తెల్లపాడు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. రమేష్‌ను 108 వాహనంలో కావలిలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

ప్రభుత్వ సేవలు పొందడం ప్రజల హక్కు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజలకు పక్కాగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం కావలిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరికీ వంద శాతం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమం, సేవలు అందలేదనే పరిస్థితి ఉండరాదనే లక్ష్యంతో మొదటి దశలో వలంటీర్లు, గృహసారథులు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి 'జగనన్న సురక్ష'ను వివరించి ప్రజా సమస్యలను నమోదు చేసుకున్నారని తెలిపారు. శనివారం నుంచి ప్రతి సచివాలయంలో మండల స్థాయి అధికారులు ధ్రువపత్రాలు జారీ చేయడం, సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. నియోజకవర్గంలో ఏ గ్రామ, వార్డు సచివాలయంలో ఏ తేదీన క్యాంపు నిర్వహిస్తున్నారనే పూర్తి సమాచారం సమీపంలో సచివాలయాల్లో తెలిజేస్తారన్నారు.

ఒక్క శాతం ప్రజలకు కూడా మిగిలిపోరాదన్నదే..

సాంకేతిక కారణాలతో పథకాలు పొందలేకపోయిన ప్రజలు ఒక్క శాతం కూడా ఉండకూడదనే జగనన్న సురక్ష ఉద్దేశమని వివరించారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఆదాయ తదితర పత్రాలను సర్వీసు ఫీజు కూడా లేకుండా ప్రజలకు అందిస్తామని వివరించారు. కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా, లంచాలకు, వివక్షకు తావు లేకుండా సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో.. నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందించడమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కావలి ప్రశాంతమే

కావలి ఎప్పుడూ ప్రశాంతంగానే ఉంటుందని, రౌడీయిజం అనేది లేనే లేదని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి చెప్పారు. టీడీపీ నాయకులు తమ చేతిలో ఉన్న పచ్చ మీడియాతో కలిసి లేనిపోనివి దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. నిత్యం దుష్ప్రచారం చేయడం వల్ల ప్రజలు కొద్ది రోజులకు వాటిని నిజమని నమ్ముతారనే ఆశ టీడీపీ నాయకులదని ఎమ్మెల్యే చెప్పారు. కాని ప్రజలకు ఎవరు ఏమిటో చాలా స్పష్టంగా తెలుసని ఎమ్మెల్యే అన్నారు. మేనిఫెస్టోను మాయం చేసి, ఎన్నికల వాగ్దానం ప్రజలకు తెలిననివ్వకుండా దిగజారుడు పనులు చేసే చంద్రబాబు చెత్త పరిపాలనను ప్రజలు చూశారన్నారు. మేనిఫెస్టోను ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా భావించి ప్రజలు కోసం వాటిలో ఉన్న ప్రతి ఒక్క కార్యక్రమాన్ని అమలు చేసే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జంపాని రాఘవులు, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, కనపర్తి రాజశేఖర్, పొనుగోటి అనురాధ, గుర్రం వెంకటేశ్వర్లు, పెనుమల్లి అశోక్, కొమారి రాజు, కృష్ణమూర్తి, షేక్ నాయబ్ రసూల్, నాగనగారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

సంగం: ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. శుక్రవారం సంగం పొదుపు కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతినిధులు, అధికారులు జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై అధికారులు శాఖల వారీగా వివరించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామ పరిధిలో ఉన్న సమస్యలను జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాలు సమర్పించారు. సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆనం అరుణమ్మ మాట్లాడుతూ జిల్లాలో జెడ్పీ నిధులతో మండలాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. మండలంలో ఇప్పటికే జెడ్పీ నిధులతో రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.34 లక్షలు నిధులు విడుదల చేశామన్నారు. మండల అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రావుల లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇన్‌చార్జి తహసీల్దారు అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కంటాబత్తిన రఘునాథ్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష

- ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి



అల్లంపాడు సచివాలయంలో జగనన్న సురక్ష ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): జగనన్న సురక్ష ద్వారా అర్హులైన లబ్ధిదారులకు 11 రకాల ధ్రువ పత్రాలు అందించడానికి ప్రభుత్వం సంకల్పించిన కార్యక్రమం అమల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి తెలిపారు. మర్రిపాడు మండలం అల్లంపాడు, చుంచులూరు సచివాలయాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఆయా సచివాలయాల్లో శనివారం నుంచి మొదటి విడతగా జగనన్న సురక్ష ద్వారా నమోదు చేయించుకున్న లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. ఎవరైనా అర్హులు జాబితాలో నమోదు చేయకుంటే అధికారుల దృష్టికి తెచ్చి తమ పత్రాలను పొందవచ్చన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ నిర్వహించిన సర్వే ఆధారంగా నిర్దేశిత తేదీల్లో జగనన్న సురక్ష ధృవపత్రాల జారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సర్వే సందర్భంగా నమోదు చేయించుకొని టోకెన్ పొందిన కుటుంబాల వారు ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, సచివాలయ సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మర్రిపాడు తహసీల్దార్ ఆనంద రావు, ఆర్‌ఐ సురేంద్ర, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్ ఖాన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బస్సు యాత్ర వెలవెల

- కార్యకర్తలు లేక బోసిపోయిన యాత్ర
- కలిసిరాని తమ్ముళ్లు
- చంద్రబాబును నమ్మని ప్రజలు



ఉదయగిరిలో ట్యాంకు బండ్ వద్ద కార్యకర్తలు లేక వెలవెలపోతున్న బస్సు యాత్ర

ఉదయగిరి: భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో టీడీపీ నేతలు ఉదయగిరిలో శుక్రవారం చేపట్టిన బస్సు యాత్రకు స్పందన కరువైంది. వింజమూరులో ఉదయం 10 గంటలకు వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి యాత్ర ప్రారంభమవుతున్నట్లు ముందు రోజు ప్రచారం చేసిన ఆ సమాయానికి పెద్దగా కార్యకర్తలు లేకపోవడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైంది. నియోజర్గంలోని ఎనిమిది మండలాల నుంచి కూడా క్యాడర్ నుంచి పెద్దగా స్పందన రాలేదు. వింజమూరులో కూడా చైతన్య రథయాత్ర నిర్వహించలేదు. మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, కంభం విజయరామిరెడ్డి వెంకటేశ్వరస్వామి గుడిలో పూజలు నిర్వహించి బస్సు యాత్ర ప్రారంభించారు. జాతీయ రహదారి నుంచి బంగ్లా సెంటర్ మీదగా బత్తినవారిపల్లికి వెళ్లి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాయంత్రం ఉదయగిరిలో ట్యాంక్‌బండ్ వద్ద నుంచి బస్సుకు ముందు కొన్ని బైక్‌లతో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అయితే పట్టణ ప్రజల నుంచి స్పందన రాలేదు. చంద్రబాబు ఎన్నికల్లో చెప్పిన హామీలకు చేసే దానికి పొంతన ఉండదని చర్చించుకోవడం కనిపించింది. గత ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయం పాలైంది. ఉదయగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌లో జరిగిన ఎన్నికల్లో కేవలం రెండుసార్లు మాత్రమే టీడీపీ విజయం సాధించింది. తెలుగు తమ్ముళ్లు పూర్తి స్థాయిలో పాల్గొనలేదు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే లక్ష్యం

- పొదుపు మహిళలతో బ్యాంకర్ల సమావేశం



మాట్లాడుతున్న ఏసీ వెంకటేశ్వరరావు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తుందని, అందులో భాగంగా పొదుపు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రణాళికలు ప్రభుత్వం రూపొందిస్తుందని పొదుపు సంఘాల ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో ఏపీఎం బి.వెంకమ్మ ఆధ్వర్యంలో మండలంలోని పొదుపు సంఘాల లీడర్లు పలు బ్యాంకు అధికారులతో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఏసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంత మహిళలు స్వయం ఉపాధి సాధించడంతో పలువురికి ఉపాధి కల్పించేలా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మండలానికి 25 యూనిట్‌లు స్థాపించేలా లక్ష్యం నిర్దేశించినట్లు ఏసీ తెలిపారు. బ్యాంకు అధికారులు సైతం చిన్న తరహా, కుటీర పరిశ్రమలను ఏజెన్సీ లాంటి వ్యాపారాలను ప్రోత్సహించేందుకు 'ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్' ప్రోగ్రామ్‌కు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. పొదుపు మహిళలు వారి శక్తి సామర్థ్యాలను బట్టి పరిశ్రమలను ఎంపిక చేసుకోవచ్చునని, ఆయా పరిశ్రమలు, వ్యాపారాల స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకులు రుణాలు అందిస్తాయని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని పొదుపు మహిళల సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం పలు బ్యాంకుల అధికారులు వారి బ్యాంకుల్లో ఖాతాలు ఉన్న పొదుపు మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహిళలు పేర్కొన్న పరిశ్రమలను నమోదు చేసుకుని వాటి ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఎస్‌బీఐ, కెనరా, యూనియన్, ఏపీజీబీ, తదితర బ్యాంకుల మేనేజర్లు బి రాఘవేంద్ర, బి నాగేశ్వరరావు, హనుమంత రావు, హరికృష్ణ, పొదుపు సంఘాల సీసీలు పాల్గొన్నారు.

అంద్రాకు పరామర్శ



బాలగురవారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు

వరికుంటపాడు: ఇటీవల పొలం పనులు చేసుకుంటూ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు అంద్రా బాలగురవారెడ్డిని శుక్రవారం సాయంత్రం జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్సై విజయ్ శ్రీనివాసులు పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మాదక ద్రవ్యాలపై విస్తృత ప్రచారం



ఉదయగిరి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు శుక్రవారం మాదక ద్రవ్యాల నిషేధిత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను సీఐ గిరిబాబు, ఎస్సై ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాటు చేశారు. వ్యవసాయ, డిగ్రీ, జూనియర్ కళాశాలల వద్ద, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన అనంతరం మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మేజిస్ట్రేట్‌కు ఘన సన్మానం

ఆత్మకూరు: ఉద్యోగ విరమణ చేసిన ఆత్మకూరు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎ.రాజేష్‌ను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి కాత్యాయిని, మరో సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

అశాస్త్రీయంగా ఐసీడీఎస్ సెక్టార్లు విభజన


- మేకపాటి రాజారెడ్డికి విన్నవించిన కార్యకర్తలు

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వరికుంటపాడు మండలంలో సెక్టార్ల విభజనలో నిబంధనలు పాటించకుండా తమ ఇష్టానురాజ్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు కార్యకర్తలు శుక్రవారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం మండలంలో వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లి, పెద్దిరెడ్డిపల్లి సెక్టార్లు ఉన్నాయి. తిమ్మారెడ్డిపల్లిని కుదించి రెండు సెక్టార్లుగా మార్చుతున్న నేపథ్యంలో పెద్దిరెడ్డిపల్లికి దగ్గర ఉన్న పంచాయతీలు కలపకుండా, 35 కి.మీ దూరంలో ఉన్న పంచాయతీలు కలపడం ఇబ్బందిగా ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించి మేకపాటి సోదరులు పీడీతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పారు.

నేడు జగనన్న సురక్ష క్యాంపు

కావలి: పట్టణంలోని 3, 4, 5 వార్డులకు చెందిన ప్రజలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేసే జగనన్న సురక్ష క్యాంపును స్థానిక పాతూరులోని బొమ్మారెడ్డివారి వీధిలో ఉన్న సచివాలయంలో శనివారం అందజేస్తారని కావలి మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. 28, 30 వార్డులకు సంబంధించి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉన్న వార్డు సచివాలయంలో ఇస్తారని చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్ర 5 గంటలు వరకు నిర్వహించే జగనన్న సురక్ష క్యాంపులో ఇప్పటికే సర్వే ద్వారా సర్టిఫికెట్లు తీసుకోవడానికి టోకెన్లు అందుకున్న వారితో పాటు, సర్వే జరిగినప్పుడు తమ నివాసాల వద్ద అందుబాటులో లేని వారు కూడా తమకు అవసరమైన కొత్త రేషన్‌కార్డు పొందడానికి, రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల వివరాలు తొలిగింపు, కొత్తగా నమోదులతో పాటు ఇతర అన్ని రకాల సేవలు ఉచితంగానే అందజేయనున్నట్లు కమిషనర్ వివరించారు.

డాక్టర్ సేవలు మరువలేం



ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో విశేష సేవలు అందించిన డాక్టర్ లలితాశేఖర్ చిరకాలం గుర్తుండిపోతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. గైనకాలజిస్ట్‌గా ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు అందించిన డాక్టర్ లలితాశేఖర్ ఎందరో గర్భిణులకు పండంటి బిడ్డలు కలిగేలా వైద్య సేవలు అందించారన్నారు. ఆస్పత్రిలో రికార్డు స్థాయిలో కాన్పులు జరగడంలో ఆమె కృషి ఎంతో ఉందన్నారు. ఆమె శుక్రవారంతో ఉద్యోగ విరమణ చేయడంతో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం, ఆఫీస్ సూపరింటెండెంట్ వి శ్రీనివాసరావు, ఆర్ఎంఓ ఉషాసుందరి, వైద్యులు సుబ్బారెడ్డి, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్ హరినారాయణను కలిసిన రాజారెడ్డి



మంత్రి కాకాణిని కలిసిన రాజారెడ్డి

- కలెక్టర్, ఎస్పీ, మంత్రితో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి భేటీ

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేసి మెట్ట ప్రాంతాన్ని డెల్టా ప్రాంతంతో సమానంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు ఇవ్వాలని ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి(రాజారెడ్డి) కలెక్టర్ హరినారాయణను కోరారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు ప్రాజెక్ట్‌లు, సోమశిల హైలెవల్ కెనాల్, వెలుగొండ ప్రాజెక్ట్ జాతీయ రహదారులు అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. జూలై 5వ తేదీ తర్వాత నియోజవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడతామని కలెక్టరుకు తెలియజేశారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతిభద్రతల విషయంలో పూర్తి సహకారం అందించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా నియోజవర్గ పోలీసు అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. కలెక్టర్, ఎస్పీలు సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి నెల్లూరులోని మేకపాటి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రి కాకాణి భేటీ

మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో మేకపాటి రాజారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. గత కొన్ని నెలలు నుంచి నియోజకవర్గంలో ఆగిన అభివృద్ధిని పట్టాలెక్కించేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉదయగిరిలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ఇతర రాజకీయ అంశాలపై కొంత సేపు చర్చించుకున్నారు. ఆయన వెంట జిల్లా కో ఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్ ఉన్నారు.

మేనిఫెస్టో దాచిన చరిత్ర చంద్రబాబుది



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పాదయాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల కష్ట సుఖాలు ప్రత్యక్ష్యంగా చూసి వారి బాధలను తీర్చేలా ప్రకటించిన మేనిఫెస్టోలోని ప్రతి పథకాన్ని, చెప్పని కొత్త పథకాలను అమలు చేసిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అయితే, 600 హామీలు ఇచ్చి మేనిఫెస్టోను దాచేసిన చరిత్ర చంద్రబాబుది అని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. మేనిఫెస్టో ప్రకారం అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాలన్నీ చేరాలనే సదుద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, తదితరులు మాట్లాడారు. చంద్రబాబు హామీలను తుంగలో తొక్కి తగుదునమ్మా అంటూ ప్రతిపక్ష నాయకుడి పాత్ర పోషించలేక.. ప్రజల మన్ననలు పొందిన ముఖ్యమంత్రిని విమర్శించడం ఆయన రాజకీయ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా నవరత్నాలు పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. సాంకేతిక కారణాలతో అర్హతలు ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేని వారిని వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది గుర్తించి వారికి పథకాలు అందించేందుకు నిర్దేశించిన కార్యక్రమమే జగనన్న సురక్ష అన్నారు. గత నెలలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో 60 వేలకుపైగా సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా పరిష్కారం అయ్యాయన్నారు. సురక్ష కార్యక్రమంలో తొలివిడత ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లి సచివాలయం పరిధిలో సేకరించిన సమస్యల పరిష్కారానికి శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్ రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, అంద్రా వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రామాలయాన్ని గ్రామానికి అప్పగించండి



ఏసీ శ్రీనివాసరావుకు వివరణ ఇస్తున్న మహిళలు

కలిగిరి: మండలంలోని తెల్లపాడు కోదండరామస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త విషయంలో నెలకొన్న వివాదం కారణంగా ఉత్సవాలు జరగడం లేదని, ఈ విషయంపై విచారణ జరిపి ఆలయాన్ని గ్రామానికి అప్పగించి ఉత్సవాలు జరిగేలా చూడాలని మహిళలు కోరారు. తెల్లపాడులోని కోదండరామస్వామి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మార్లెళ్ల వెంకటశేషారెడ్డిపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ జే శ్రీనివాసరావు శుక్రవారం విచారణ చేపట్టారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి వెంకటశేషారెడ్డి 2016లో డిప్యూటీ కమిషనర్ ద్వారా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తగా ఉత్తర్వులు పొందారని గ్రామానికి చెందిన జూపల్లి వెంకటేశ్వరరావు, ఉభయకర్తలు దేవదాయశాఖ మంత్రి, కమిషనర్‌కు ఫిర్యాదులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఆలయ ప్రాంగణంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఉభయకర్తలు, పలువురు గ్రామస్తులు వ్యవస్థాపక ధర్మకర్త శేషారెడ్డి నియామకం చెల్లదని లిఖిత పూర్వకంగా వివరణ ఇచ్చారు. ఉభయకర్తలు, గ్రామస్తులు అందరూ కలిసి ఆలయ అభివృద్ధి, ఉత్సవాలు చేస్తున్నారన్నారు. మార్లెళ్ల వంశీయులు మాత్రమే ఆలయాన్ని నిర్మించలేదని, ఆలయానికి ఎటువంటి భూములు ఇవ్వలేదని విన్నవించారు. ఈ వివాదాల కారణంగా ఈ ఏడాది నవమి ఉత్సవాలు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆలయాన్ని గ్రామస్తులందరికీ చెందేలా చూడాలని అధికారులను కోరారు. వ్యవస్థాపక ధర్మకర్త శేషారెడ్డి నుంచి ఆరోపణలపై లిఖిత పూర్వకంగా వివరణ తీసుకున్నారు. ఏసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ చైతన్య పాల్గొన్నారు.